క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది తీరాన వెలసిన లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ముడుపుల పూజలు జరిగాయి. లక్ష్మీనృసింహస్వామివారికి ప్రీతికరమైన గురువారం కావడంతో దూరప్రాంతాల వేలాది మంది భక్తులు పూజా సామగ్రితో వచ్చి స్వామిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు చేశారు. ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసా చార్యులు పర్యవేక్షణలో అర్చకబృందం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. దూర ప్రాంతాల నుంచి ఉపవాసాలతో వచ్చి పూజల్లో పాల్గొన్న భక్తులందరికి ఆలయ ఉత్సవ కమిటీ, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

రబీ వరి పనుల్లో నిమగ్నం

సీతానగరం: మండలంలో నీటి వనరులున్న గ్రామాల్లో రైతులు ఖరీఫ్ వరి పనులు ముగిసిన అనతి కాలంలో రబీవరి సాగుకు అవసరమైన మడులలో దమ్ముచేసిన వరి యద వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ మేరకు పుష్కలంగా నీటి వనరులు కలిగిన చినభోగిలి, వెంకటాపురం, బూర్జ, చెల్లంనాయుడువలస, తామరఖండి, బళ్లకృష్ణాపురం గ్రామాల్లో రైతులు రబీవరి సాగుకు, ఎరువులు సమీకరించడానికి అవసరమైన పనుల్లో నిమగ్నమయ్యారు. కొన్ని గ్రామాల రైతులు వరిమాగాణీ భూముల్లో నీటితో దమ్ముచేసి మొక్కవేసే పనుల్లో ఉన్నారు. ఇప్పటికే 250 హెక్టార్లలో రబీవరిసాగు చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు.

ఎస్సీ జనాభా వివరాలతో సోషల్ ఆడిట్

పార్వతీపురం టౌన్: రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ జనాభా వివరాలతో సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి ఎం.డి గయాజుద్దీన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ కులగణన వివరాలను గత డిసెంబరు 26 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించామన్నారు. అభ్యంతరాల స్వీకరణకు గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించారని చెప్పారు. 16వరకు అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర వివరాల సేకరణ అనంతరం ఈనెల 20న కులగణన తుది వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసుల దృష్టి

సీతానగరం: మండలంలోని రాష్ట్రరహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు రాష్ట్ర రహదారిలో చినభోగిలి-సీతానగరం గ్రామాల మధ్య గోతులు ఏర్పడిన ప్రాంతాల్లో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల కారణంగా గోతులను పూడ్చే పనులను చేయించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేష్ మాట్లాడుతూ ఇంతవరకూ చిన్నారాయుడుపేట-గుచ్చిమి,జోగింపేట-సీతానగరం, రోడ్లపై గోతులు పూడ్చించినట్లు చెప్పారు. గురువారం చినభోగిలి- సీతానగరం గ్రామాల మధ్య సిమెంట్ కాంక్రీట్‌తో రోడ్డు గోతులు పూడ్చివేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురంటౌన్: మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఒ.గోపాలరావు నాయుడు తెలిపారు. 33/11 కేవీసబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం 11కేవీ అడ్డాపుశీల ఫీడర్ ట్రీ కటింగ్, పోల్ లీనింగ్ ఉండడం వల్ల ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అడ్డాపుశీల, బంటువనివలస, బాలగూడబ, వెంకటరాయుడు పేట, నర్సిపురం బీసీ కాలనీ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బలిజిపేట మండలంలో...

బలిజిపేట: మండలంలో శుక్రవారం ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నందున వినియోగదారులు గమనించాలని విద్యుత్‌శాఖ ఏఈ సింహాచలం తెలిపారు. మెయింటనెన్స్ పనులు నిర్వహిం చనున్నందున సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులకు భోజనాలు



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

మక్కువ: మండలంలోని శంబర పీహెచ్‌సీలో గురువారం శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో గర్భిణులకు భోజనాలు అందజేశారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి ప్రతినెలా గర్భిణులు ఆరోగ్య పరీక్షల నిమిత్తం శంబర ఆస్పత్రికి వస్తుంటారు. ఆరోగ్య తనిఖీకి వచ్చిన గర్భిణులకు మధ్యాహ్నం భోజనాన్ని సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో దాతలు ఏర్పాటు చేస్తుంటారు. గురువారం ఎంఈఓ పెంట సత్యనారాయణ గర్భిణులకు భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్యసిబ్బంది, సత్యసాయి సేవాసమితి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తిరుపతి దుర్ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబుదే బాధ్యత



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- టీడీపీ పాలనలోనే రాష్ట్రంలో దుర్ఘటనలు
- ప్రభుత్వ వైఫల్యంతోనే తొక్కిసలాటలో భక్తుల మృతి
- మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల తొక్కిసలాటకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని, ఈ దుర్ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యత వహించాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలోని తన స్వగృహంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. తొక్కిసలాటలో అరుగురు భక్తులు మరణించడం బాధాకరమని వాపోయారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏనాడూ తిరుపతి పుణ్యక్షేత్రంలో ఇటువంటి దుర్ఘటన జరగలేదన్నారు. వైకుంఠ ఏకాదశి దర్శనాలకు చాలా డిమాండ్ ఉంటుందని ప్రభుత్వయంత్రాంగానికి తెలియదా? అని ప్రశ్నించారు. తగు ఏర్పాట్లు చేయడంలో అధికార యంత్రాంగం ఎందుకు విఫలమైందని విరుచుకుపడ్డారు.

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే ఇటువంటి సంఘటనలు ఎందుకు జరుగుతున్నాయని నిలదీశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో గోదావరి పుష్కరాల సందర్భంగా తొక్కిసలాటలో చాలామంది భక్తులు మరణించారని అలాగే చంద్రబాబు సభల్లోను తొక్కిసలాటలో ప్రజలు మరణించారని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అయిదేళ్ల పాలనలో ఏనాడూ తిరుపతిలో ఎటువంటి అపశ్రుతి దొర్లలేదని పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

టీడీపీ కూటమి ప్రభుత్వం పాలనలో తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, క్షతగాత్రులపై ప్రత్యేక దృష్టి సారించి మంచి చికిత్స అందివ్వాలని కోరారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా, అమాయక ప్రజల మరణాలు సంభవించకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మం గురించి మాట్లాడే ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ సంఘటనపై ఏ విధంగా స్పందిస్తారో చూడాలంటూ నిట్టూర్చారు.

అటవీ ఉత్పత్తుల లక్ష్యం రూ.12కోట్లు

- జీసీసీ డీఎం వి.మహేంద్రకుమార్



పార్వతీపురంటౌన్: పార్వతీపురం డివిజన్ పరిధిలో 2024-25 సంవత్సరానికి పార్వతీపురం, సాలూరు, గుమ్మలక్ష్మీపురం బ్రాంచిల నుంచి అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు లక్ష్యం రూ.12కోట్లు కాగా ఇప్పటి వరకు సుమారు రూ.6కోట్ల వరకు లక్ష్యం సాధించామని జీసీసీ డీఎం వి.మహేంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన స్థానిక జీసీసీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం సీజన్ ప్రారంభమైనందున కొనుగోలు ప్రారంభించామన్నారు. ఇప్పటికే బ్రాంచిల పరిధిలో ఉన్న కొనుగోలు కేంద్రాల్లో ఎంఎస్‌పీ ధరలు సూచించే పట్టికలు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతంలో చింతపండు ఫలసాయం అధికంగా ఉండడంతో నాణ్యమైన చింతపండును రూ.34 ధరగా జీసీసీ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి నిర్ణయించారు. దీంతో పాటు మిగతా అటవీ ఉత్పత్తులకు కూడా ధరలు నిర్ణయించారు. కరక్కాయలు, రూ.18 నుంచి రూ.20, ముషిడిక రూ.90 నుంచి రూ.100, పిక్క తీసిన చింతపండు రూ.63 నుంచి రూ.67, విప్పపువ్వు రూ.29 నుంచి రూ.32కు ధరలు నిర్ణయించామన్నారు. ఇందుకనుగుణంగా గిరిజన గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా కరపత్రాలు ముద్రించి పంపిణీ చేశామని, గిరిజన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా అటవీ ఉత్పత్తులు నాణ్యత తగ్గకుండా చూడాలని సూచించారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



పార్వతీపురం టౌన్ సీఐ మురళీధర్

పార్వతీపురంటౌన్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎవరైనా చట్ట వ్యతిరేకంగా కోడి పందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పార్వతీపురం టౌన్ సీఐ మురళీధర్ హెచ్చరించారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోడి పందాలు, జూదం వంటివి నిర్వహిస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కోడి పందాలు నిర్వహించినా, వాటిని చూసినా నేరమని, పందాలు, జూదం నిర్వహించిన స్థలం వారిపై కూడా నమోదు చేయనున్నామని ప్రజలందరూ గుర్తించాలని హితవు పలికారు. చట్ట వ్యతిరేక కార్య కలాపాలను నివారించేందుకు వార్డుల్లో ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. సంక్రాంతి పండగను ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని సూచించారు.

అటవీ ఉత్పత్తుల ధరలపై గిరిజనులకు అవగాహన



అటవీఉత్పత్తుల ధరలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మక్కువ: మండలంలోని పనసభద్ర పంచాయతీ మెండంగి గ్రామంలో గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో గిరిజనుల నుంచి కొనుగోలు చేస్తున్న అటవీ ఉత్పత్తుల ధరలపై జీసీసీ బ్రాంచ్ డైరెక్టర్ నూకమ్మ గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ ఉత్పత్తులు సేకరిస్తున్న గిరిజనులు దళారుల బారినపడి మోసపోవద్దని హితవు పలికారు. గిరిజనులు సేకరించిన, పండించిన అటవీ ఉత్పత్తులకు మంచి గిట్టుబాటు ధర అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జీసీసీ ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. ఈ ఏడాది కిలో చింతపండు రూ.34, రెండు చీపుర్లు రూ.45కు కొనుగోలు చేయనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సేల్స్‌మెన్ ఎస్.రామారావు, వీడీవీకే సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



పెద్దింపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: వెనుకబడిన విద్యార్థులను ముందుకు తీసుకురావడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ-1సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు మండలంలోని పెద్దింపేట, పోలినాయుడువలస ప్రాథమికపాఠశాలలను ఆయన గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పరిశీలించి వారి నైపుణ్యాలను గుర్తించారు. తెలుగు, ఆంగ్లం భాషా అంశాలను చదివించారు. ఐదవ తరగతి విద్యార్థులను గణితంలో భిన్నాలపై ప్రశ్నించారు. పాఠశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో వివిధ తరగతుల్లో ఉండే వెనుకబడిన విద్యార్థులను ముందుకు తీసుకురావడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. బడితోటను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

పార్వతీపురం: వెనుకబడిన తరగతుల వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు బీసీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకు లింకేజీతో కూడిన సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువత ఉపాధికి సబ్సిడీ రుణాలు, బీ-ఫార్మా, డీ-ఫార్మా చదివిన నిరుద్యోగులకు జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు రాయితీ రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 21 నుంచి 60ఏళ్ల వయస్సు ఉండి దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వెనుకబడిన తరగతులు, అగ్రవర్ణాల్లోని పేదల (ఈడబ్ల్యూఎస్ కేటగిరి కులాలు (ఈబీసీ,కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్యవైశ్య)కు స్వయం ఉపాధి కల్పించేందుకు 50 శాతం సబ్సిడీతో రుణాలను మంజూరు చేయనున్నామన్నారు. అలాగే వీరు జనరిక్ మెడికల్ షాపులు పెట్టుకున్న 50శాతం సబ్సిడీ ఉంటుందని పేర్కొన్నారు. అగ్రవర్ణాలలోని పేదలకు ఈబీసీ 6 యూనిట్లు, బ్రాహ్మణులకు 5 యూనిట్లు, క్షత్రియులకు ఒక యూనిట్ వెరసి 12 యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.అలాగే ఈబీసీ జెనరిక్ షాపుల ఏర్పాటుకు రెండు యూనిట్లు మంజూరు చేయనున్నామన్నారు.

16లోగా దరఖాస్తు చేసుకోవాలి

బీసీ కులాల యువతకు సాధారణ అభివృద్ధి రుణాల కింద 1221 యూనిట్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. శ్లాబ్-1 రకం యూనిట్ విలువ రూ.2లక్షల లోపు ఉంటుంది. సబ్సిడీ రూ.75వేలు ఉంటుంది. శ్లాబ్-2 రకం రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు ఉంటుంది. సబ్సిడీ రూ.1.25లక్షలు శ్లాబ్-3,లో యూనిట్ విలువ రూ.5లక్షల వరకు ఉంటుంది. సబ్సిడీ రూ.2లక్షలు, మిగిలిన మొత్తం బ్యాంకు నుంచి పొందాల్సి ఉంటుంది. బీసీలకు జనరిక్ మందుల షాపు ఏర్పాటుకు (బీ-ఫార్మా, డీ-ఫార్మా) 25యూనిట్లు లక్ష్యంగా పెట్టుకున్నామని, యూనిట్ విలువ రూ.8లక్షలుకాగా సబ్సిడీ రూ.4లక్షలు ఉంటుందని తెలిపారు. అర్హులు, ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 16లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకున్న తరువాత ఎంపీడీఓ/మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పార్వతీపురం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ మజ్జి శోభారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రూపేష్ గురువారం తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. అలాగే అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని స్పష్టం చేశారు.

12న జట్టు ఆశ్రమంలో యువజన ఉత్సవాలు

పార్వతీపురంటౌన్: ఈనెల 12న పార్వతీపురం పట్టణంలోని జట్టు ఆశ్రమంలో యువజన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పార్వతీపురం స్వచ్ఛ సుందర జిల్లా సమన్వయకర్త బి.రామగోపాల్ తెలిపారు. జాతీయ యువజన దినోత్సవం నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో స్వచ్ఛ సుందర పార్వతీపురం అంశాలకు సంబంధించిన నిర్వహించనున్న వివిధ పోటీల్లో గెలుపొందే విద్యార్థులకు బహుమతులు సర్టిఫికెట్లు కలెక్టర్ చేతుల మీదుగా ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

ఈ నెల 17,18,19 తేదీల్లో విజయవాడకు ప్రత్యేక బస్సులు

సాలూరు: సంక్రాంతి పండగ నేపథ్యంలో ఈ నెల 17,18,19 తేదీల్లో సాలూరు నుంచి విజయవాడకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపోమేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మూడు రోజుల్లో ఉదయం 6 గంటలకు సాలూరు బస్‌స్టేషన్ నుంచి అల్ట్రా డీలక్స్ బస్ విజయవాడకు నడపనున్నట్లు తెలిపారు. ఆ బస్సు రాత్రి 8.10 గంటలకు విజయవాడ బస్‌స్టేషన్ నుంచి సాలూరుకు బయల్దేరుతుందన్నారు. ఈ బస్సులకు సాలూరు నుంచి విజయవాడ, విజయవాడ నుంచి సాలూరుకు ఏపీఎస్‌ఆర్టీసీ ఆన్‌లైన్.ఇన్.సైట్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చని సూచించారు.

నేడు సాలూరులో విద్యుత్ సరఫరాలో అంతరాయం

సాలూరు: సాలూరు సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ సాలూరు టౌన్-2 ఫీడర్, ఆటోనగర్ స్టేషన్ పరిధిలో పాలిటెక్నిక్ ఫీడర్ల పరిధిలో ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీరు గోపాలరావు నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో లైన్ల గుండా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించే పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కావున ఈ ఫీడర్‌ల పరిధిలో గల వీధులలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా సుబ్బమ్మ పేరంటాలు జాతర

సీతానగరం: మండలంలోని జోగింపేటలో సుబ్బమ్మ పేరంటాలు అమ్మవారి జాతర గురువారం ఘనంగా జరిగింది. ఏటా సంక్రాంతి పండగకు ముందు వారం సుబ్బమ్మ పేరంటాలు జాతర నిర్వహించడం శతాబ్దాల కాలంగా గ్రామంలో ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు ఆలయ ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో పేరంటాలు పూనకంతో ఉన్న వారు గ్రామంలో తిరువీధి చేస్తూ అక్షతలను మహిళల ఒడిలో వేసి దీవెనలు అందించారు. వేలాదిమంది భక్తులు పేరంటాలి గుడివరకూ మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

పార్వతీపురం: పట్టణంలోని శ్రీ కృష్ణా స్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముగ్గులు, సంక్రాంతి వేషధారణలు వేయించి ఆకట్టుకున్నారు. సంక్రాంతి సందర్భంగా వేసిన ముగ్గులు చిన్నారుల్లో ఆనందాన్ని నింపడంతోపాటు నైపుణ్యాన్ని వెలికితీసేందుకు అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ గణేష్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులతో ముగ్గులు, పాటలు, పలు వేషధారణ వేయించారు.

జీడి ప్రాసెసింగ్ ద్వారా రైతుకు అధిక లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురంటౌన్: జీడి ప్రాసెసింగ్ ద్వారా గిరిజనులకు అధిక లాభాలు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సబ్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో వెలుగు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని వన్‌ధన్ వికాస్ కేంద్రాలను వాడుకలోకి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. జీడి పంటలను అభివృద్ధి చేయాలని చెప్పారు. నాణ్యమైన జీడిని సేకరించడం ద్వారా అధిక ధర లభిస్తుందన్నారు. రైతుల ద్వారా సేకరించిన జీడిని గుమ్మలక్ష్మీపురం, సాలూరులలో స్థాపించబోయే ప్రాసెసింగ్ సెంటర్‌లో ధరను నిర్ణయించి జీడి రైతులకు అధిక లాభాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వెలుగు సిబ్బందికి సూచించారు. సమావేశంలో వెలుగు డీపీఎం అప్పారావు, ఏపీఓ మురళీధర్, ఎనిమిది మండలాల వెలుగు ఏపీఎంలు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీలో వేణుగోపాలస్వామి తిరువీధి



గోదాదేవి సహిత వేణుగోపాలస్వామివారిని పల్లకీలో తిరువీధి చేస్తున్న అర్చకులు, భక్తులు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీతీరాన వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాన్ని పురస్కరించుకుని గోవింద మాలలు ధరించిన భక్తులు గోదాదేవి సమేత వేణుగోపాలస్వామి వారిని గురువారం వేకువజామున పల్లకీలో ఊరేగించారు. ఆలయ అర్చకులు పీసపాటి భరత్‌చార్యులు, శ్రీనివాసాచార్యులు స్వామి అమ్మవార్లను పల్లకీలో అధిష్టింపచేసి భక్తులతో తిరువీధి గావించారు. గోదాదేవి సమేత వేణుగోపాలస్వామివారికి పూజలు చేసిన అనంతరం భక్తులందరూ నగర సంకీర్తనలు చేసి, గోవిందనామాలు పురవీధుల్లో ఆలపించారు. తిరువీధి అనంతరం తిరిగి ఆలయానికి చేరుకున్న భక్తులందరూ అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పూజలనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో పర్యవేక్షణ



కేజీబీవీలో భోజనం రుచి పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు

మక్కువ: మండలంలోని కాశీపట్నంలో గల కేజీబీవీ, ములక్కాయవలస ఆదర్శ పాఠశాలలో సామాజిక తనిఖీ బృందం గురువారం పర్యటించింది. పాఠశాలల్లోని రికార్డులను ఈ సందర్భంగా పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి చర్చించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న అన్ని ల్యాబ్‌లు, తనిఖీ చేశారు. పాఠశాల వసతి గృహాలను తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం స్టేట్ రిసోర్స్‌పర్సన్ బి.దాస్, డీఆర్‌పీలు, శ్రీను బి. వరాహమూర్తి విద్యార్థుల తల్లిదండ్రులతో ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.భారతి, వైస్ చైర్మన్ బి.శంకరరావు, ఎస్ఎంసీ సభ్యులతో సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ జి.నాగరత్నం, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాల సందర్శన



ఐసీడీఎస్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల ప్రభుత్వ బాలల సంరక్షణ కేంద్రాలను జిల్లా బాలల సంరక్షణ పర్యవేక్షణ కమిటీ గురువారం సందర్శించింది. బాలసదనం శిశు గృహాలను జిల్లా బాలల సంరక్షణ అధికారి పర్యవేక్షణ కమిటీ సందర్శించి పర్యవేక్షించారు. ఈ పర్యవేక్షణలో భాగంగా ప్రస్తుతం ఆయా బాలల సంరక్షణ కేంద్రాల పనితీరు, రికార్డుల నిర్వహణ అంశాల గురించి నిశితంగా పరిశీలించారు. జిల్లా ప్రొహిబిషన్ ఆఫీసర్ బీవీ.రవికుమార్, బాలల సంరక్షణ కేంద్రాలు నడుపుతున్న ఇన్‌చార్జ్‌లకు కొన్ని సూచనలిచ్చారు. బాలల న్యాయ చట్టం 2015 ప్రకారం రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న కారణంగా నిబంధనల కనుగుణంగా ఇక్కడ ఏర్పాట్లు ఉన్నాయో లేదో పరిశీలించడం కోసం వచ్చామన్నారు. అలాగే బాలల సంరక్షణ కేంద్రాల్లో ప్రతి గదిని పరిశుభ్రంగా ఉంచుతున్నారో లేదో పరిశీలించామని చెప్పారు. అదేవిధంగా ఈ సంరక్షణ కేంద్రంలో మెడికల్ ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందులో పని చేసే స్టాఫ్‌కు పిల్లల పట్ల బాధ్యతగా ఉండాలని తెలియజేశారు. పర్యవేక్షణ కమిటీలో పర్యవేక్షణలో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎ.సత్యనారాయణ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్.ప్రసాదరావు, లీగల్ కం ప్రొహిబిషన్ అధికారి పి.శ్రీధర్ పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి



నిరసన తెలుపున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురంటౌన్: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం నియోజకవర్గ సమన్వయకర్త బత్తిన మోహన్ అన్నారు. ఈ మేరకు మండలంలోని నర్సిపురం గ్రామపంచాయతీలో ఆయన ఆధ్వర్యంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గల డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్ షాను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో పార్వతీపురం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మండల అధ్యక్షులు తేళ్ల గౌరీ శంకర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాయి శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కోలా కిరణ్, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు చింతాడ దిలీప్, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

మేట్స్ పునర్వ్యవస్థీకరణ శిక్షణ



బలిజిపేటలో శిక్షణ ఇస్తున్న అధికారులు

బలిజిపేట: మేట్స్ పునర్వ్యవస్థీకరణ శిక్షణ కార్యక్రమాన్ని బలిజిపేట వెలుగు శిక్షణ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం ఏపీఓ కేశవరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. గతంలో ఉన్నట్లు శ్రమశక్తి సంఘాలు, మేట్స్ పునర్వ్యవస్థీకరణ, దినసరి వేతనం రూ.300, రాబోయే ఆరు నెలలు అనుసరించాల్సిన ప్రణాళికలపై శిక్షణలో వివరించారు. అందులో భాగంగా మామిడితోటలో పనుల నిర్వహణలో చేపట్టాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా గ్రామాల్లో శుక్రవారం జరగనున్న పల్లెపండగ వారోత్సవాల్లో భాగంగా మినీ గోకులాల ప్రారంభోత్సవాలను నారన్నాయుడువలస, సుభద్ర, బర్లి, వెంగళరాయపురం గ్రామాల్లో నిర్వహించనున్నారని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, మేట్లు, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతినాయుడికి రాజన్నదొర పరామర్శ



తిరుపతినాయుడిని పరామర్శిస్తున్న రాజన్నదొర

సాలూరు రూరల్: మాజీజెడ్పీటీసీ, ప్రస్తుత వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ తండ్రి తిరుపతి నాయుడిని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర గురువారం పరామర్శించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇంటిదగ్గరే వైద్యసేవలు అందుకుంటున్నారు. గతంలో కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల్లో కీలకపాత్ర పోషించిన ఆయన ప్రస్తుతం రాజకీయ పరిస్థితులపై రాజన్నదొరతో చర్చించారు.